ఈనాడు
అన్నమయ్య
గురువారం అక్టోబరు 17, 2024

నేడు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు

రాయచోటి, న్యూస్‌టుడే: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు గురువారం సెలవు ప్రకటించినట్లు డీఈవో శివప్రకాష్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులను ప్రతి ఒక్కరు విధిగా పాటించాలని, ప్రైవేటు విద్యాసంస్థలు తరగతులు నిర్వహిస్తే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. భారీ వర్షాల నేపథ్యంలో పిల్లలు నీటి ప్రవాహ ప్రాంతాలకు వెళ్లకుండా తల్లిదండ్రులు పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వైభవంగా పవిత్రాల సమర్పణ

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : తితిదే ఆధ్వర్యంలోని స్థానిక శ్రీపట్టాభి రామాలయంలో మూడు రోజుల నుంచి స్వామివారి వార్షిక పవిత్రోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మూడో రోజైన బుధవారం సుప్రభాత సేవ, నిత్యసేవలు జరిగాయి. ఉదయం 7 గంటలకు యగశాల వైదిక కైంకర్యాల నిర్వహణ అనంతరం ఉదయం 11 గంటలకు మంగళ వాయిద్యాల నడుమ అర్చకులు ఊరేగింపుగా పవిత్రాలను తీసుకెళ్లి వైభవంగా సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ఊంజల్ మండపంలో స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా విశేషాలంకరణలో ముస్తాబైన సీతా, లక్ష్మణ సమేత శ్రీరాముల వారు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఆలయాధికారి కృష్ణమూర్తి, ఆలయ అర్చకులు కృష్ణరాజ్ భట్టార్, బాషికాచార్యులు, కుమార్ స్వామి, తితిదే అధికారులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


ఊరేగింపుగా పవిత్రాలను తీసుకెళ్తున్న వేద పండితులు

ఆలయ ధ్వంసంపై సమగ్ర విచారణ చేయండి

అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

ఈనాడు, అమరావతి : ములకలచెరువు మండలం కదిరినాథుని కోటలోని అటవీ ప్రాంతంలో అభయాంజనేయస్వామి ఆలయంపై దుండగుల దుశ్చర్యను ముఖ్యమంత్రి చంద్రబాబు ఖండించారు. ఆలయానికి జరిగిన నష్టాన్ని తెలుసుకొన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

జలఖడ్గం

- జిల్లావ్యాప్తంగా ఉద్యాన, వ్యవసాయ పంటలకు తీవ్ర నష్టం
- నేలకొరిగిన విద్యుత్తు స్తంభాలు, దెబ్బతిన్న రోడ్లు
- కలెక్టరేట్, డివిజన్ కేంద్రాల్లో కంట్రోల్ రూంలు


జలమయమైన రాజంపేట ఆర్టీసీ డిపో ప్రాంగణం


శేషాచలం అడవుల నుంచి గుంజనేరుకు చేరుతున్న వరద నీరు


పెద్దతిప్పసముద్రం వద్ద నీటమునిగిన టమాట తోట


నందలూరు మండలం ఆడపూరులో నేలకొరిగిన వరి పంటను చూపిస్తున్న రైతు జయచంద్రారెడ్డి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం జిల్లాలోని రైల్వేకోడూరు, రాయచోటి, రాజంపేట, మదనపల్లె, పీలేరు తదితర ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం చూపింది. విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలతో జన జీవనం స్తంభించింది. జడివానతో ఎప్పుడు ఎలాంటి ముంపు ముప్పు ముంచుకొస్తుందోనని ప్రజలు, రైతులు భయాందోళనకు గురవుతున్నారు. అష్టకష్టాలు పడి కంటికి రెప్పలా కాపాడు కుంటున్న పచ్చని పంటలకు వాన పోటు తప్పలేదు. పంటలు సాగు చేసిన రైతులకు అపార నష్టం వాటిల్లింది. పల్లె, పట్టణ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు ముంపుబారిన పడ్డాయి. పలు ప్రాంతాల్లో రహదారులు దెబ్బతిన్నాయి. జలాశయాల్లోకి వరదనీరు చేరుతోంది.
- న్యూస్‌టుడే, రాయచోటి, జిల్లా బృందం

ముంపు భయం

● జిల్లాలోని రహదారులకు స్వల్ప నష్టం వాటిల్లింది. రైల్వేకోడూరులో తెగిపోయిన తూర్పుపల్లి, కమ్మపల్లి రహదారులను ఈఈ సహదేవరెడ్డి పరిశీలించారు. పుల్లంపేట, ఓబులవారిపల్లి, పెనగలూరు, నందలూరు, రాజంపేట, రాయచోటి మండలాల్లో పలు రహదారులు జలమయమయ్యాయి. ● రాయచోటిలోని మదనపల్లె రోడ్డులో దుకాణాల్లోకి చేరిన వరద నీటిని అధికారులు పరిశీలించి కాలువలు మళ్లించారు. ● రాయచోటిలోని రింగ్‌రోడ్డులోని చిత్తూరు హైవే, చెన్నముక్కపల్లి, ఆర్టీసీ కార్యాలయాల వద్ద వర్షపు నీరు నిలిచిపోయింది. ● రైల్వేకోడూరు పట్టణంలోని అంకమ్మనగర్, దర్గాపురం, లక్ష్మీనగర్‌వంటి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ● రాజంపేట ఆర్టీసీ డిపో ప్రాంగణం, చిన్నమండెం బస్టాండు నుంచి కలిబండ వెళ్లే రోడ్డు చెరువులను తలపించాయి. ● చిన్నమండెం మండలం నాగూరివాండ్లపల్లె, కోటగడ్డ కాలనీ సమీపంలో రోడ్డు నీటమునిగింది.


పుల్లంపేట మండలం చవనవారిపల్లిలో నీటమునిగిన రహదారి


రైల్వేకోడూరులో తెగిపోయిన రహదారిని పరిశీలిస్తున్న రహదారులు, భవనాలశాఖ ఈఈ సహదేవరెడ్డి


రైల్వేకోడూరు అంకమ్మనగర్‌లో వరద నీటిని పరిశీలిస్తున్న పంచాయతీ అధికారులు, సిబ్బంది

నేలవాలిన రైతుల ఆశలు

జిల్లాలోని రాయచోటి, సంబేపల్లె, చిన్నమండెం, గుర్రంకొండ, రామసముద్రం, ములకలచెరువు మండలాల్లో టమాట తోటలకు వర్షపు నీరు చేరడంతో కాయలు కుళ్లిపోయి నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజంపేట, రైల్వేకోడూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లి మండలాల్లోని చియ్యవరం, ఉటుకూరు, మారుపల్లెలలో 16 హెక్టార్లలో అరటి, బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయని జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు పేర్కొన్నారు. రైల్వేకోడూరు, పెనగలూరు, రాజంపేట, నందలూరు మండలాల్లో 45 హెక్టార్లలో వరి పంట దెబ్బతిందని డీఏవో చంద్రనాయక్ తెలిపారు. నందలూరు మండలం ఆడపూరు, పాటూరు, కుమ్మరపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో 150 ఎకరాల్లో వరి, ఎర్రచెరువుపల్లిలో 50 ఎకరాల్లో పసుపు పంట దెబ్బతింది. రాజంపేట మండలం మదనగోపాలపురం, తాళ్లపాక, అప్పారాజుపేట, మందరం, కొత్తపల్లి, శేషమాంబపురం, మందపల్లి, పెనగలూరు మండలం నారాయణనెల్లూరు, కోమంతరాజుపురం, ఎన్‌ఆర్‌పల్లి, సిద్దవరం, వెలగచెర్లలో వరి పంటకు నష్టం వాటిల్లింది. పీలేరు నియోజకవర్గంలో వరి పంటకు నష్టం జరిగింది.


కలికిరిలో వరి పంటను పరిశీలించి రైతుకు సూచనలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు




లక్కిరెడ్డిపల్లె మండలంలో నేలవాలిన వరి

కంట్రోల్ రూంల ఏర్పాటు

జిల్లాలో తుపాను ప్రభావాన్ని అంచనా వేస్తూ సహాయక చర్యలు చేపట్టేందుకు అప్రమత్తమైన అధికారులు కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో 08561-293006, మదన పల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో 99891-76247, రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయంలో 08565-240079, రాయచోటి ఆర్డీవో కార్యాలయంలో 08561-293039 ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూంల సిబ్బంది 24 గంటలపాటు విధుల్లో ఉంటారని, ఎలాంటి విపత్తు ఎదురైనా వెంటనే సమాచారమివ్వాలని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు.

విద్యుత్తుశాఖకు నష్టం

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్తు నియంత్రికలు, స్తంభాలు నేలకొరిగాయి. రాయచోటి డివిజన్‌లో మూడు విద్యుత్తు నియంత్రికలు కాలిపోగా మరో 8 విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. పీలేరులో 3, లక్కిరెడ్డిపల్లిలో రెండు స్తంభాలు నేలకూలాయి. రాజంపేట డివిజన్‌లో మూడు విద్యుత్తు నియంత్రికలు దెబ్బతిన్నాయి. పుల్లంపేట, ఓబులవారిపల్లి, వీరబల్లి మండలాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది.


వీరబల్లి మండలం వంగిమళ్లలో ఒరిగిపోయిన విద్యుత్తు నియంత్రిక, తీగలు

జిల్లాలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నమోదైన వర్షం (మిల్లీమీటర్లలో)

మండలం	వర్షపాతం
రైల్వేకోడూరు	141.6
ఓబులవారిపల్లి	88.8
చిట్వేలి	77.4
నందలూరు	63.6
రాజంపేట	63.2
పుల్లంపేట	63.2
రాయచోటి	60.0
వీరబల్లి	58.0
సుండుపల్లి	49.2
పెద్దమండ్యం	47.8
గాలివీడు	47.0
పెనగలూరు	45.6
సంబేపల్లె	35.4
చిన్నమండెం	33.6
రామాపురం	32.0

ప్రాజెక్టులకు వరదనీరు

జిల్లాలోని ప్రాజెక్టులకు వరద నీరు చేరుతోంది. వెలిగల్లు జలాశయం గరిష్ఠ నీటి సామర్థ్యం 4.64 టీఎంసీలు కాగా, బుధవారం నాటికి 2.37 టీఎంసీల నీటి నిల్వలు చేరాయి. ఎగువ నుంచి 250 క్యూసెక్కుల నీరు చేరుతోంది. కేవీపల్లి, పీలేరు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు పింఛ ప్రాజెక్టులోకి 40 క్యూసెక్కుల నీరు చేరుతోంది. పెద్దేరు, బాహుదా, ఝరికోన, మండిపల్లి నాగిరెడ్డి రిజర్వాయర్లకు స్వల్పంగా నీరు చేరుతోంది. శేషాచల అడవుల నుంచి రైల్వేకోడూరులోని గుంజనేరులోకి వెయ్యి క్యూసెక్కుల నీరు చేరుతోంది. పింఛ, ఝరికోన ప్రాజెక్టులు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.


వెలిగల్లు జలాశయంలో పెరుగుతున్న నీటిమట్టం

కూలిన ఇంటి గోడలు

రైల్వేకోడూరు పట్టణంలో ఆత్మకూరు అరుణమ్మ పూరిగుడిసె గోడలు కూలిపోయాయి. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. భర్త మరణించిన అరుణమ్మ చుట్టుపక్కల ఇళ్లల్లో పనిచేసుకుంటూ మతిస్థిమితం లేని తన ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నారు. ఇల్లు కూలిపోవడంతో ఆదుకోవాలని ఆమె వేడుకుంటున్నారు.



డ్రోన్లతో పరిశీలన : జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాల్లో డ్రోన్లతో ప్రమాదకర ప్రాంతాలను అధికారులు చిత్రీకరించి అక్కడ చేపట్టాల్సిన ముందస్తు చర్యలను గుర్తించారు. రాయచోటి, రాజంపేట, మదనపల్లె డివిజన్లకు మూడు డ్రోన్లు పంపగా, రైల్వేకోడూరులోని గుంజనేరు పరిసర ప్రాంతాలు, చెరువులు, కుంటలు, రహదారులపై ప్రమాదకరంగా ఉన్న కల్వర్టులు, వంతెనలను డ్రోన్లతో చిత్రీకరించారు. ఈ మేరకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు.

నల్లబారిన బంతిపూలు


రామసముద్రంలో దెబ్బతిన్న బంతిపూల తోట

జిల్లాలోని మదనపల్లె, రామసముద్రం, నిమ్మనపల్లె మండలాల్లో రూ.కోటి పెట్టుబడితో సాగు చేసిన 200 ఎకరాలకుపైగానే బంతితోటలకు నష్టం వాటిల్లింది. పువ్వుల్లో తేమశాతం ఎక్కువై నల్లబారిపోవడంతో రూ.50 లక్షలకుపైగా రైతులు నష్టపోయారు. గిట్టుబాటు ధర లున్న సమయంలో తుపాను తమను నట్టేట ముంచిందని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై మదనపల్లె ఉద్యాన శాఖ ఏవో ఈశ్వర్‌ప్రసాద్ మాట్లాడుతూ నష్టంపై సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.

ఆరోగ్య శిబిరాల నిర్వహణ


రైల్వేకోడూరులో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో అధికారులు

జిల్లాలో కురుస్తున్న వర్షాలతో అంటువ్యాధులు, డయేరియా, జ్వరాలు ప్రబలకుండా వైద్యాధికారులు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. రైల్వేకోడూరులోని లోతట్టు ప్రాంతాలు, గుంజనేరు పరివాహక గ్రామాలు, గంగెద్దుల మిట్ట, జానకీపురం, శెట్టిగుంట, శ్రీనివాసపురం ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని డీఎంహెచ్‌వో డాక్టరు కొండయ్య తెలిపారు. రైల్వేకోడూరు నారాయణ పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు.

నాలుగెకరాల్లో వరికి నష్టం



నేను నాలుగెకరాలు కౌలుకు తీసుకుని రూ.75 వేలు పెట్టుబడితో వరి పంట సాగు చేశాను. రెండు రోజుల్లో కోతకొస్తుందన్న సమయంలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో మొలకలొచ్చింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలి.

-సూర్యనారాయణ, నారాయణనెల్లూరు, పెనగలూరు మండలం

రూ.40 వేలు పెట్టుబడి నీటిపాలు



మొత్తం 1.5 ఎకరాల్లో రూ.40 వేలు పెట్టుబడి పెట్టి వరి పంట సాగు చేశాను. దాదాపు పంట చేతికొచ్చే సమయానికి తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు పంట దెబ్బతిని నీటి పాలైంది. మొత్తం పెట్టుబడి నష్టపోయాం. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

- రమణారెడ్డి, బోగంపల్లె, వాల్మీకిపురం మండలం

మొత్తం నేలరాలిపోయాయి



నాలుగెకరాల్లో రూ.10 లక్షలు ఖర్చు చేసి టమాట సాగు చేశాను. మరో వారం రోజుల్లో దిగుబడి తీయాల్సి ఉండగా తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు పూత మొత్తం రాలి పోగా, ఉన్న కాయలు పగిలిపోయి అమ్మకానికి పనికిరాకుండా నేలరాలిపోయాయి.

- వెంకట్రమణనాయుడు, శాఖంవారిపల్లె, వాల్మీకిపురం మండలం

దిగుబడి దక్కే అవకాశమే లేదు



మూడెకరాలో టమాట సాగు చేశాను. తుపాను ప్రభావంతో తోటలో నీరు నిలిచిపోయింది. తోటలోని కాయలకు తెగుళ్లు, మచ్చలు ఏర్పడడంతో నాణ్యత దెబ్బతింది. దిగుబడి చేతికందే పరిస్థితి కనిపించడంలేదు. పంట చేతికందే సమయంలో భారీ వర్షాలు దెబ్బతీశాయి.

-శ్రీనివాసులు, పెద్దపాళ్యం, ములకలచెరువు మండలం

రాయలసీమను రతనాల సీమగా మార్చుతాం. ఉద్యాన పంటల్లో రాయలసీమ అగ్రస్థానంలో ఉండడంతో ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీని తీసుకొచ్చాం. యువతకు ఉపాధి కల్పనలో భాగంగా 'వన్ ఫ్యామిలీ- వన్ ఎంటర్‌ప్రెన్యూర్' నినాదంతో ముందుకెళుతున్నాం. ఉద్యోగం చేయడమే కాదు.. ఉద్యోగం ఇచ్చేలా వ్యవస్థను తీర్చిదిద్దుతాం. పెన్నా- వంశధార నదులను అనుసంధానం చేస్తాం. కొప్పర్తి పారిశ్రామిక వాడను ఉన్నతంగా తీర్చుదిద్దుతాం.
-నూతన పాలసీలపై బుధవారం ప్రకటన చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు

సీమ కష్టాలు చూశాం. సీమ కన్నీళ్లు తుడుస్తాం. సీమ జిల్లాలను ఆటో మొబైల్, ఎలక్ట్రానిక్స్ కంపెనీలకు చిరునామాగా మారుస్తాం. ప్రత్యేకించి హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్ది ఉద్యాన రైతులకు అండగా నిలుస్తాం. 'మిషన్ రాయలసీమ' పేరిట పథకాలు ప్రకటిస్తున్నాం. తెదేపా అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో హామీలు నెరువేరుస్తాం. మీ కన్నీళ్లు తుడవాలంటే వైకాపాకు ఇచ్చిన సంఖ్యాబలాన్ని తెదేపాకు ఇవ్వండి. అభివృద్ధి ఏమిటో చేసి చూపిస్తాం.
-2023, జూన్ 7న కడపలో జరిగిన సభలో మిషన్ రాయలసీమ ప్రకటన సందర్భంగా మంత్రి నారా లోకేశ్ చేసిన వ్యాఖ్యలు

ఉందిలే మంచి కాలం ముందు ముందునా!

- యువత భవిష్యత్తును మార్చేలా విధానాలు
- హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు మార్గం సుగమం
- సీఎం ప్రకటించిన పాలసీలతో చిగురించిన ఆశలు

–ఈనాడు, కడప

ఉద్యోగం కోసం నువ్వెళ్లేది ఎక్కడికి?.. తెలంగాణా?.. కర్ణాటకా?.. తమిళనాడా?.. ఇది అటు అన్నమయ్య.. ఇటు వైఎస్ఆర్ జిల్లాల్లోని బీటెక్, డిగ్రీ చివరి ఏడాది చదివే విద్యార్థుల్లో ఏ ఇద్దరు కలిసినా ఎదురవుతున్న ప్రశ్న. గత పాలకుల హయాంలో ఉద్యోగావకాశాలకు కృషి చేయలేదు. సాఫ్ట్‌వేర్ కంపెనీలు, పరిశ్రమలను తీసుకొచ్చి.. యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రయత్నమంటూ జరగలేదు. శిక్షణ కేంద్రాలను మూసేసి యువతకు నైపుణ్యాలు అందకుండా చేశారు. అంకుర సంస్థలు మూతపడ్డాయి. పట్టభద్రుల్లో 24 శాతం నిరుద్యోగ రేటుతో అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లాలు ఉన్నట్లుగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నివేదిక బయటపెట్టింది. పట్టభద్రుల్లో నిరుద్యోగిత అధికంగా ఉన్నట్లు వివిధ సంస్థలు తెలిపాయి. ఇలాంటి తరుణంలో సీఎం చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పాలసీలు ఊరట కలిగిస్తున్నాయి. దీంతో పాటు గతంలో మంత్రి నారా లోకేశ్ ప్రకటించిన 'మిషన్ రాయలసీమ'లో భాగంగా ప్రకటించిన హామీలు కార్యరూపం దాల్చే విధంగా ప్రణాళిక రూపొందించారు. యువతతో పాటు రైతులకు, పెట్టుబడిదారులకు ఊరట కలిగించేలా తాజా విధానాలున్నాయి.


కొప్పర్తి పారిశ్రామికవాడ

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

పర్యాటకాభివృద్ధి ప్రస్తావన వచ్చింది. టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, టైగర్ ఎకో టూరిజం ఏర్పాటు చేయాలనే ప్రణాళికలున్నాయి. తద్వారా గండికోట, హార్సిలీహిల్స్ ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నారు. పర్యాటక పాలసీ ద్వారా కొత్త రూపు సంతరించుకోనుంది.

ఫుడ్ ప్రాసెసింగ్‌కు ప్రోత్సాహం

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేసే యజమానులకు 10 శాతం అధికంగా ప్రోత్సాహకాలందిస్తామని, ప్రత్యేకించి రాయలసీమకు ప్రాధాన్యమిస్తామని సీఎం చంద్రబాబు వివరించారు. దీంతో మామిడి, బొప్పాయి. దానిమ్మ, చీని, అరటి, టమాట తదితర పంటల సాగు చేసే రైతులకు ఉపయుక్తంగా ఉండనుంది. రెండు జిల్లాల్లో అరటి సాగు విస్తారంగా ఉంది. ప్రత్యేకించి అన్నమయ్య జిల్లాలో అరటి, బొప్పాయి, టమాట పంటలు విస్తారంగా సాగులో ఉన్నాయి. అరటి ఎగుమతులకు ప్రోత్సాహకం అందించడానికి అవకాశాలు మెండుగా ఉంటాయి. మామిడి, టమాట గుజ్జు పరిశ్రమలు తీసుకొస్తే గిట్టుబాటు ధరకు అవకాశాలు మెండుగా ఉంటాయి. ఈ మేరకు చంద్రబాబు స్పష్టత ఇచ్చారు.

కొప్పర్తిలో మెండుగా పరిశ్రమలు

రాయలసీమ జిల్లాలను ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ కంపెనీలకు చిరునామాగా మారుస్తామని సీఎం చంద్రబాబుతో పాటు గతంలోనే మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ కారిడార్ల ద్వారా పారిశ్రామిక అభివృద్ధికి కృషితో పాటు ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ కంపెనీల ద్వారా యువతకు ఉపాధికి అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు ఇప్పటికే కొప్పర్తి పారిశ్రామికవాడను ఇండస్ట్రియల్ సిటీగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించడంతో పాటు రూ.2,137 కోట్ల ఆర్థికసాయంతో 54 వేల మందికి ఉపాధి కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. తద్వారా పెద్దఎత్తున పరిశ్రమలు రానున్నాయి. గనుల ఖిల్లాగా భాసిల్లుతున్న రెండు జిల్లాల్లో గనుల పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ప్రకటించారు. తుది ఉత్పత్తి వరకు పూర్తి వ్యాల్యూచైన్ ఏర్పాటు, మైనింగ్ పనులు మన రాష్ట్రం వాళ్లే చేసేలా నైపుణ్య శిక్షణ ఇవ్వడం తదితర చర్యలు తీసుకోనున్నారు.

పెద్దదర్గా ఉరుసుకు ఉపముఖ్యమంత్రికి ఆహ్వానం

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: ప్రసిద్ధిగాంచిన కడప పెద్ద దర్గా ఉరుసుకు రావాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు దర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీ ఆహ్వాన పత్రం అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు దర్గా నిర్వాహకులు తెలిపారు.


ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఆహ్వానపత్రం అందజేస్తున్న దర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీ, నిర్వాహకులు

మరో నాలుగేళ్లు ఉచిత బియ్యం!

2028, డిసెంబరు వరకు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం

వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లోని లబ్ధిదారులకు భారీ ఊరట

-న్యూస్‌టుడే, కడప

'దేశంలో రక్తహీనత సమస్యను అధిగమించాలి. పోషకాల లోపాలను నివారించాలి. బక్కజీవులు, బడుగుల ఆకలి తీర్చాలి. సంపూర్ణ పోషకాలు అందించాలి' అని కేంద్ర ప్రభుత్వం ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. కరోనాతో కష్టకాలంలో ఉన్న ప్రజలను ఆదుకోవాలనే సదాశయంతో ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజనకు నాలుగేళ్ల కిందట శ్రీకారం చుట్టింది. తెల్ల కార్డుదారులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేయాలనేది పీఎంజీకేఏవై ముఖ్యోద్దేశం. వాస్తవంగా ఈ ఏడాది డిసెంబరు వరకు గడువు ఉండగా, పేదల నుంచి వస్తున్న విన్నపాలను పరిగణనలోకి తీసుకుని మరో నాలుగేళ్లపాటు కార్డులో నమోదైన ఒక్కొక్కరికి నెలకు అయిదు కిలోల చొప్పున ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ఉచితంగా ఇవ్వనుంది. పేదల ఆహార భద్రతకు అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం భరోసా ఇస్తున్నాయి.

★ వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న 10,91,176 కుటుంబాలకు తెల్లకార్డులు ఇచ్చారు. అందులో 32,76,098 మంది సభ్యులుగా నమోదయ్యారు. జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా కేంద్రం ద్వారా అంత్యోదయ అన్న యోజన పత్రాలు 75,580 (యూనిట్లు 2,11,346) ఇచ్చారు. బీపీఎల్‌ను పరిగణనలోకి తీసుకొని ఎన్ఎఫ్ఎస్ఏలో 9,05,059 కుటుంబాలకు తెల్లకార్డులు ఇచ్చారు. వీటిల్లో 28,10,309 మంది ఉన్నారు. వీరికి గత నాలుగేళ్లుగా ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన అమలులో భాగంగా ఉచితంగా బియ్యం ఇస్తున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో మధ్యలో కొన్ని నెలలపాటు ఇవ్వకుండా ఎగనామం పెట్టారు. కేంద్రం చొరవ తీసుకోవడంతో ఆ తర్వాత మళ్లీ కొనసాగించారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పీఎంజీకేఏవైలో పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కూడా రెండు జిల్లాల్లో ఏఏవై కార్డులు 1,260 ఇవ్వగా, ఇందులో 1,849 మంది లబ్ధి పొందుతున్నారు. బియ్యం కార్డులను 1,08,824 ఇవ్వగా, వీటి ద్వారా 2,52,584 మంది పొందుతున్నారు.


కోనరాజుపల్లెలో బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు (పాత చిత్రం)

★ గత వారంలో కేంద్ర మంత్రిమండలి సమావేశం జరిగింది. పేద, బడుగు కుటుంబాల్లోని సభ్యుల్లో ఎక్కువగా రక్తహీనత సమస్య ఉందని, పోషకాహార లోపం ఉన్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఆమాత్యులు చర్చించారు. ఉచిత బియ్యాన్ని 2028, డిసెంబరు వరకు ఇవ్వాలని అనుమతిచ్చారు. గతంలో సార్టెక్స్, నాన్ సార్టెక్స్ బియ్యం పంపిణీ చేయగా, కేంద్రం ఆదేశాలతో గతేడాది సెప్టెంబరు నుంచి ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ఇవ్వాలని ముందుకొచ్చారు. సార్టెక్స్ రకంలో 15 శాతం, నాన్ సార్టెక్స్‌లో 25 శాతం నూకలుంటాయి. వీటిని ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు ఇస్తున్నారు. ఇక సంపూర్ణ పోషక బియ్యం ఇవ్వాలని లక్ష్యంతో 100 కిలోల సార్టెక్స్ బియ్యంలో కిలో కెర్నల్ (పోషకాహారం) కలిపి అందజేసేవిధంగా ముందుకొచ్చారు. ఇకపై సాధారణ బియ్యంలో ఇనుము, ఫోలిక్ యాసిడ్, బి-12 పోషకాలను మిశ్రమం చేసి నిర్దేశిత ప్రమాణాలతో సరఫరా చేసి చౌక ధరల దుకాణాల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేయాలని నిర్ణయించారు.

★ బయటి మార్కెట్‌లో కిలో బియ్యం కొనాలంటే వ్యాపారులు రూ.50 నుంచి రూ.65 వరకు వసూలు చేస్తున్నారు. మార్కెట్లో ధరలు అమాంతంగా పెరగడంతో పేదలపై అధికంగా భారం పడుతోంది. కార్డుదారుల్లో ఎవరూ కూడా ఆకలి కేకలతో బాధపడరాదని సదాశయంతో మరో నాలుగేళ్ల పాటు బియ్యం ఉచితంగా ఇవ్వాలని కేంద్రం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందిన ఉత్తర్వులను అమలు చేయాలని అధికారులు ప్రణాళికను రూపొందించారు.

అంశం	వైఎస్ఆర్	అన్నమయ్య
మండలాలు	36	30
చౌక ధరల దుకాణాలు	1,239	1,123
మొత్తం రేషన్ కార్డులు	5,86,352	5,04,824
నమోదైన లబ్ధిదారులు	17,62,579	15,13,519
ఎన్ఎఫ్ఎస్ఏ-ఏఏవై కార్డులు	36,017	39,563
లబ్ధిదారుల సంఖ్య	99,100	1,12,256
ఎన్ఎఫ్ఎస్ఏ బియ్యం కార్డులు	4,93,908	4,11,154
లబ్ధిదారుల సంఖ్య	15,33,438	12,76,871
ఎన్ఎఫ్ఎస్ఏ మొత్తం కార్డులు	5,29,925	4,50,717
రాష్ట్రం ఇచ్చిన ఏఏవై కార్డులు	591	669
లబ్ధిదారుల సంఖ్య	848	1,001
రాష్ట్రం ఇచ్చిన బియ్యం పత్రాలు	55,386	53,438
లబ్ధిదారుల సంఖ్య	1,29,193	1,23,391
రాష్ట్రం ఇచ్చిన మొత్తం కార్డులు	56,427	54,107
రాష్ట్రం తరఫున లబ్ధిపొందేది	1,30,041	1,24,392

మా బిడ్డను కాపాడండయ్యా!

వారిది రెక్కాడితేగానీ డొక్కాడని నిరుపేద కుటుంబం. కూలి పనులకు వెళ్తేనే పూట గడిచేది. అలాంటి ఇంటికి పెద్ద కష్టమొచ్చింది. ఒక్కగానొక్క కుమారుడి గుండెకు రంధ్రం పడటంతో ఆ కుటుంబం తీవ్ర ఆవేదనను అనుభవిస్తోంది. తమ కుమారుడి గుండెకు సంబంధించి శస్త్రచికిత్స చేయించేందుకు అంత స్తోమత లేకపోవడంతో ఇంటి వద్దే మందులతో నెట్టుకొస్తున్నారు. - న్యూస్‌టుడే, నందలూరు


నవీన్ తేజతో తల్లిదండ్రులు హరిప్రసాద్, స్వర్ణలత

గుండెలో రంధ్రంతో దెబ్బతిన్న అవయవాలు

మందులకూ డబ్బుల్లేక తల్లిదండ్రుల ఆక్రందన

దాతలు, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

ఉమ్మడి కడప జిల్లా నందలూరు మండలం నాగిరెడ్డిపల్లి హరిజనవాడకు చెందిన నాయనపల్లి హరిప్రసాద్, స్వర్ణలత దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు నవీన్‌తేజ (14) పుట్టిన కొన్ని రోజులకే తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి గుండెలో రంధ్రం ఉందంటూ ఆందోళన చెందారు. పది కిలోల బరువు ఉంటేనే శస్త్రచికిత్స చేయడానికి వీలవుతుందని చెప్పడంతో వెనక్కి వచ్చేశారు. తిరిగి ఏడేళ్ల అనంతరం నిమ్స్ ఆసుపత్రిలో పరీక్షలు చేయించగా గుండెలో రక్తప్రసరణ సరిగా లేదని, ఊపిరితిత్తుల్లోకి రక్తం చేరుతోందని, అవయవాలు సైతం దెబ్బతింటున్నాయని, శస్త్రచికిత్స చేయలేమన్నారు. చేసినా ప్రయోజనం లేదని తేల్చి చెప్పారు. దీంతో అప్పటి నుంచి కేవలం మందులతోనే నెట్టుకొస్తున్నారు.

★ నవీన్‌తేజ గతేడాది స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న సమయంలో తల నొప్పితో బాధపడుతూ కళ్లు తిరిగి పడిపోవడంతో వెంటనే తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షలు చేయగా మెదడులో కణితి ఉందని, వెంటనే శస్త్ర చికిత్స చేయాలని చెప్పడంతో చేయించారు. నాలుగు అడుగులు నడిచినా ఆయాసంతో పడిపోతున్నాడని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలి పనులకు వెళ్తే తమకు పూట గడవదని, అలాంటిది తమ కుమారుడి మందులకు నెలకు రూ.6 వేల వరకు ఖర్చవుతోందని వాపోతున్నారు. ఇప్పటి వరకు సుమారు రూ.10 లక్షల వరకు అప్పులు చేసి ఆసుపత్రుల చుట్టూ తిరిగామని, ప్రస్తుతం ఆర్థిక స్తోమత లేకపోవడంతో మందులు సైతం కొనలేని పరిస్థితిలో ఉన్నామని తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమవుతున్నారు.

★ కొన్నేళ్ల కిందట తన భార్య స్వర్ణలతకు మెదడులో కణితి ఉండటంతో రూ.లక్ష ఖర్చు చేసి శస్త్రచికిత్స చేయించినట్లు హరిప్రసాద్ తెలిపారు. ఇటీవల తమ కుమార్తె ఆరోగ్యం కూడా బాగోలేదని, ఉన్న కుమార్తెను వెంట తిరుగుతూ కూలి పనులకు వెళ్లలేకున్నామని... వేదనతో బతుకీడుస్తున్నామని ఆవేదన చెందుతున్నారు. దాతలు స్పందించి ఆర్థిక సాయం అందించి తమ కుమారుడిని కాపాడాలని, ప్రభుత్వం పింఛను అందించి ఆదుకోవాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

దాతలు స్పందించి ఫోన్ చేయాల్సిన చరవాణి నంబరు : 9154991003

తుపాను ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవాలి


బాహుదా జలాశయం అధికారులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: వర్షాలు విపరీతంగా కురుస్తున్న నేపథ్యంలో తుపాను ప్రభావాన్ని అధికారులు అప్రమత్తంగా ఉండి సమర్థంగా ఎదుర్కోవాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. బుధవారం నిమ్మనపల్లె బాహుదా జలాశయాన్ని తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. బాహుదా నీటి సామర్థ్యం, ఉన్న నీరు, బాహుదాకు చేరుతున్న నీరు, జలాశయం తలుపులు, తూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనుకోని పరిస్థితుల్లో వర్షాలు ఎక్కువైతే జరిగే ప్రమాదాలు నష్టాల పట్ల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. తుపాను ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు సూచనలిచ్చి చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో నిమ్మనపల్లె తహసీల్దారు ధనంజయులు, జలవనరులశాఖ ఈఈ సురేంద్రరెడ్డి, డీఈ ప్రసాద్, ఏఈ శ్రీహరిరెడ్డి, ఆర్ఐ రాంప్రసాద్, వీఆర్వో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులూ... అప్రమత్తంగా ఉండాలి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: అల్పపీడనం దృష్ట్యా కురుస్తున్న వర్షాలకు ఎలాంటి సమస్యలు వచ్చిన పరిష్కారానికి అన్నిశాఖల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని కొత్తపల్లెలోని ఓబుల్‌నాయనిచెరువు, వేంపల్లె, చీకలబైలు పంచాయతీల పరిధిలోని వెంకటమ్మచెరువు, కదిరమ్మ చెరువులను ఆయన తనిఖీ చేశారు. వర్షపు నీరు వస్తే ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మట్టికట్టల పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికారులకు సహకరించాలని గ్రామీణులను కోరారు. రెవెన్యూ, పురపాలక, విద్యుత్తు, రోడ్లు భవనాలశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్‌శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తహసీల్దార్ ఖాజాబీ, జలవనరులశాఖ డీఈ దయారాం ప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ వెంకటరమణ, ఆర్ఐ రెడ్డెప్ప, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయం కూల్చివేతపై ప్రభుత్వం సీరియస్

నిందితులను కఠినంగా శిక్షించాలని కోరిన కూటమి నేతలు

ములకలచెరువు, న్యూస్‌టుడే : ములకలచెరువు మండలంలో అభయాంజనేయస్వామి ఆలయం కూల్చివేత రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ అయినట్లు తంబళ్లపల్లె తెదేపా నేత జయచంద్రారెడ్డి తెలిపారు. ములకలచెరువు సమీపంలో 16వ శతాబ్దంలో విజయనగర రాజుల కాలంలో కనుగొండరాయస్వామి ఆలయాన్ని నిర్మించారని ఆలయం ఎదురుగా అప్పట్లో బండపై చెక్కిన స్వామి విగ్రహానికి 2012లో ఆలయాన్ని నిర్మించారు. అయితే గుర్తు తెలియని దుండగులు సోమవారం అర్ధరాత్రి ఆలయం కూల్చివేతకు పాల్పడ్డారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి ఆలయం పూర్తిగా నేలమట్టమైంది. ఆంజనేయస్వామి విగ్రహం విరిగి నేలకూలింది. ఆలయాన్ని రిగ్గులతో కూల్చేందుకు యత్నించిన దుండగల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ములకలచెరువు సీఐ రాజా రమేష్‌తో పాటు ఎస్ఐలు గాయత్రి, నరసింహుడు ఆలయాన్ని పరిశీలించి ఆధారాల కోసం కనుగొండ ప్రాంతంలో గాలించారు. ఎలాంటి ఆధారాలు కనిపించపోవడంతో ఈ కేసును త్వరగా ఛేదించేందుకు ముమ్మరంగా విచారణ చేపట్టారు. నియోజకవర్గ తెదేపా నేత జయచంద్రారెడ్డి, నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడు నేలకూలిన ఆలయాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఆలయాన్ని గుప్త నిధుల కోసం కూల్చారా? లేక ఇతర ఉద్దేశాలైమైనా ఉన్నాయా? అన్న విషయంపై పోలీసులు విచారణ చేపట్టాలన్నారు. అభయాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. భాజపా జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్, తంబళ్లపల్లె జనసేన నియోజకవర్గ బాధ్యుడు సాయినాథ్ నేలమట్టమైన ఆలయాన్ని పరిశీలించి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కూటమి నాయకులు గోపాల్‌రెడ్డి, కేవీ రమణ, సురేష్, శ్రీనివాసులు, శంకర్‌రెడ్డి, సుదర్శన్ తదితరులు ఉన్నారు.


నేలమట్టమైన ఆలయాన్ని పరిశీలిస్తున్న తెదేపా నేత జయచంద్రారెడ్డి

సీఎం సహాయ నిధికి వితరణ

పీలేరు, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా పారా మిలిటరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరద బాధితుల కోసం సీఎం సహాయనిధికి రూ.లక్ష చెక్కును అందజేసినట్లు పారామిలిటరీ అసోసియేషన్ అధ్యక్షులు పీఎస్ ఖాన్, కార్యదర్శి పి.చంద్రశేఖర్, సలహాదారుడు బీసీ రెడ్డెప్ప, కోశాధికారి ఏ.రమణబాబు తెలిపారు. సభ్యులంతా సీఎంను కలిసి చెక్కు అందజేసినట్లు తెలిపారు.


సీఎం చంద్రబాబు నాయుడుకు రూ.లక్ష చెక్కు అందజేస్తున్న సంఘం నాయకులు

పీజీ కోర్సుల్లో నేరుగా ప్రవేశాలు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంపీఈడీ కోర్సుల్లో ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు నేరుగా అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు, నిర్ణీత ఫీజుతో హాజరు కావాలని సూచించారు. ఏపీ పీజీసెట్ - 2024 ఎంట్రన్స్ రాసి అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే ప్రవేశాలకు అర్హులన్నారు. వివరాలకు yvu.edu.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. ఎంఏ, ఎంఎస్సీ, ఎంకాం, ఎంపీఈడీ సబ్జెక్టుల విభాగాల్లో ఖాళీలు ఉన్నాయని చెప్పారు.

క్రీడాజ్ఞాన్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె విద్య: కేంద్ర క్రీడా భారతి ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా జ్ఞాన్ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని క్రీడా భారతి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్‌కుమార్, నరేష్‌కుమార్ తెలిపారు. గ్రూప్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ నవంబరు 30, వ్యక్తిగత రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ డిసెంబరు 6గా నిర్ణయించారన్నారు. డిసెంబరు 8న ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏ సమయంలోనైనా ఆన్‌లైన్ పరీక్ష రాయవచ్చునన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.50 వేలు చొప్పున ఇద్దరికి, మూడో బహుమతి రూ.25 చొప్పున ఆరుగురికి, నాలుగో బహుమతి రూ.11 వేలు చొప్పున 11 మందికి ఇవ్వనున్నారన్నారు. ఈ అవార్డులను చైతన్య కశ్యప్ ఫౌండేషన్ వారు అందజేస్తారన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి కేసులో మధ్యంతర ఉత్తర్వుల పొడిగింపు

ఈనాడు, అమరావతి: వైకాపా రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని పుంగనూరు వెళ్లకుండా నియంత్రిస్తూ ఏమైన ఉత్తర్వులిచ్చి ఉంటే వాటిని తమ ముందుంచాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విచారణను ఈ నెల 22కు వాయిదా వేసింది. ఈ మేరకు బుధవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ ఉత్తర్వులిచ్చారు. పిటిషనర్ అరెస్టు విషయంలో తొందరపాటు చర్యలొద్దంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు పొడిగించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో రిజర్వాయర్ల కోసం సేకరించిన భూములకు పరిహారం విషయమై వినతి ఇచ్చేందుకు వెళ్లిన తమపై ఎంపీ మిథున్‌రెడ్డి, ఆయన అనుచరులు దాడి చేశారని ఏఎస్ఆర్‌కే ప్రసాద్, సొహైల్ బాషా ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పుంగనూరు పోలీసులు పలువురిపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. వాటిలో ముందస్తు బెయిలు కోసం మిథున్‌రెడ్డి వేసిన పిటిషన్లపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. పోలీసుల తరఫున అదనపు పీపీ మర్రి వెంకటరమణ వాదనలు వినిపిస్తూ. . పుంగనూరు వెళితే శాంతిభద్రతలకు విఘాతమని పోలీసులు చెప్పినా పిటిషనర్ పెడచెవిన పెట్టారన్నారు. ఎంపీ అనుచరులే రాళ్లు, కర్రలతో ఫిర్యాదుదారులు, ప్రత్యర్థులపై దాడి చేశారన్నారు.

సగం మందికి నేటికీ అందని తిండి

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు గడుస్తున్నా రాష్ట్రంలో 50 శాతం మంది ప్రజానీకం కనీసం తినడానికి తిండికి లేని దుస్థితిలో ఉన్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి శోభ పేర్కొన్నారు. బుధవారం నిమ్మనపల్లె తహసీల్దారు కార్యాలయం వద్ద ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ప్రపంచ ఆకలి దినంగా మార్చు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని తహసీల్దారు ధనంజయులు ద్వారా ముఖ్యమంత్రికి పంపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాజ్యాంగ బద్ధమైన ఆహార హక్కు, పని హక్కు, కనీస వేతనాల హక్కు, భూమి హక్కు వంటి ఎన్నో చట్టాలుండగా అవి రాజకీయ నాయకుల ప్రసంగాలకు, కాగితాలకు పరిమితం అవుతున్నాయన్నారు. నిమ్మనపల్లె మండలంలో చాలా ఎస్సీ కాలనీలకు శ్మశాన వాటికలు లేక మృతిచెందిన వారిని వేసుకోవడానికి సొంత భూములు లేక అనేక వెతలు పడుతున్నారని ప్రభుత్వం స్పందించి శ్మశానవాటికలకు స్థలాలు కేటాయించాలన్నారు. తహసీల్దారు స్పందించి హామీ ఇచ్చారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉన్న కూలీలను నైపుణ్య కూలీలుగా గుర్తించి కనీస వేతనం రోజుకు రూ.850 ఇవ్వాలని డిమాండు చేశారు.



తహసీల్దారుకు వినతిపత్రం సమర్పిస్తున్న మహిళా ప్రతినిధులు

ఏనుగుల గుంపు విధ్వంసంపై అధికారుల నివేదిక

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: పీలేరు మండలంలో ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ గుంపు వ్యవసాయ పంట పొలాలపై పడి విధ్వంసం సృష్టించాయి. అటవీశాఖ అధికారులు జోరు వర్షంలో శ్రమించి ఈ ఏనుగుల గుంపును పులిచెర్ల మండలం కల్లూరు అటవీ ప్రాంతానికి తరిమేశారు. బుధవారం అటవీశాఖ అధికారులు ఏనుగులు ధ్వంసం చేసిన పంట పొలాలను పరిశీలించారు. మండలంలోని కాకులారంపల్లె పంచాయతీ పరిధిలోని చిన్న గాండ్లపల్లె, కొత్తపల్లె, బందార్లవాండ్లపల్లె, ఇందిరమ్మ కాలనీ పరిసరాల్లో పంటలను ధ్వంసం చేశాయి. అటవీశాఖ అధికారులు సంబంధిత రైతులతో మాట్లాడారు. పంట నష్టం అంచనా వేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఎఫ్‌బీవో గిరినాథ్‌బాబు తెలిపారు. త్వరలోనే రైతులకు నష్ట పరిహారాన్ని అందజేస్తామని ఆయన చెప్పారు.


ఏనుగుల గుంపు తొక్కేసిన పంటను పరిశీలిస్తున్న అధికారులు

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


శంకరప్ప (పాత చిత్రం)

రామసముద్రం, న్యూస్‌టుడే: మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన రామసముద్రం మండలం బూసానికురప్పల్లెలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్.ఐ. వెంకటసుబ్బయ్య కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఊలపాడు గ్రామ పంచాయతీ బూసానికురప్పల్లెకు చెందిన శంకరప్ప (55)కు భార్య లలితమ్మ, కుమార్తె జ్యోతి, కుమారుడు జగన్నాథ ఉన్నారు. కుమార్తెను కర్ణాటక రాష్ట్రం ముళబాగల్ పట్టణంలోని ఓ వ్యక్తికి ఇచ్చి ఎనిమిదేళ్ల క్రితం వివాహం చేశారు. వారికి అక్షయ, లాస్య ఇద్దరు పిల్లలు. ఆడ పిల్లలు పుట్టారనే కారణంతో భార్య, భర్తల మధ్య వివాదాల చోటు చేసుకుని రెండేళ్ల క్రితం కుమార్తె పుట్టింటికి వచ్చేసింది. ఆమె జీవితంపై విరక్తితో ముళబాగల్ పట్టణానికి సమీపంలోని గుట్టలో ఇద్దరు ఆడ పిల్లలను చంపేసింది. జైలుశిక్ష అనుభవించిన అనంతరం ఆగస్టు 15న విడుదలై పుట్టింటికి చేరింది. ఈ ఘటనలతో జీవితంపై విరక్తి చెందిన శంకరప్ప రెండు నెలలుగా మద్యానికి అలవాటుపడ్డాడు. మంగళవారం రాత్రి గ్రామానికి సమీపంలోని శీతరగానిపల్లె రోడ్డు పక్కనే చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కుమారుడు జగన్నాథ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గాడిద పాల కేసులో మరో ఇద్దరి అరెస్టు


నిందితుడు గుర్రం యోగానంద రెడ్డి

హొసపేటె, న్యూస్‌టుడే: జెన్నీ మిల్క్ కంపెనీ పేరిట గాడిద, వాటి పాలు విక్రయించి, రైతులను వంచించిన కేసులో మరో ఇద్దరు ఆంధ్రావాసులను బుధవారం కర్ణాటక రాష్ట్రం విజయనగర జిల్లా హొసపేటె పోలీసులు అరెస్టు చేశారు. వీరిని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విక్రమనగర్ చెందిన ఎన్.హర్షవర్ధన్‌రాజు, రాయచోటికి చెందిన గుర్రం యోగానందరెడ్డిగా గుర్తించారు. వీరి నుంచి రూ.10 లక్షలు విలువైన కారును స్వాధీనం చేసుకున్నారు. రైతుల నుంచి వసూలు చేసి, వీరి బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.36 లక్షలను జప్తు చేశారు. జెన్నీ మిల్క్ గాడిద, పాలు విక్రయం కంపెనీలో వీరిద్దరూ ఉద్యోగులని చెప్పి రైతులను వంచించారని విలేకరుల సమావేశంలో విజయనగర ఎస్పీ శ్రీహరిబాబు తెలిపారు. ఇప్పటి వరకు ఈ కేసులో మొత్తం ఐదుగురిని అరెస్టు చేశామని ఎస్పీ పేర్కొన్నారు. మరికొంత మందిని అరెస్టు చేసే అవకాశం ఉందని ఆయన వివరించారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

రామాపురం, న్యూస్‌టుడే: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని మేదరపల్లె తనిఖీ కేంద్రం వద్ద కారులో నాలుగు ఎర్రచందనం దుంగలు అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం ముందస్తు సమాచారంతో తనిఖీలు చేస్తుండగా కడప వైపు నుంచి ఓ కారులో దుంగలను తరలిస్తున్న నిందుతుడు షేక్ జిలాన్ బాషాను అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.


పట్టుబడిన ఎర్రచందనం దుంగలు, నిందితుడితో పోలీసులు

మదనపల్లె
• మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

మరుగుదొడ్లు నిర్మించండి


ఈవోకు వినతినిస్తున్న ధరణికుమార్, నాయకులు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : పీలేరు మేజర్ పంచాయతీ పరిధిలో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధరణికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పీలేరు ఈవో గురుమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. అవసరాల నిమిత్తం పట్టణానికి వస్తున్న గ్రామీణ ప్రజలకు ఒకటికి, రెంటికి వస్తే తిరిగి ఇంటికి వెళ్లే వరకు అలాగే ఉండాల్సిన దుస్థితి తలెత్తుతోందని వినతిపత్రంలో వివరించారు. పీలేరు పంచాయతీలో జరిగిన నిధుల మంజూరు, ఖర్చులు వివరాలు వెల్లడించాలని సహ దరఖాస్తు అందజేశారు.

విరామం లఘుచిత్రం ప్రారంభం

పీలేరు, న్యూస్‌టుడే: విజయ్ క్రియేషన్స్ పీఎల్ఆర్ బ్యానరుపై 'విరామం' లఘుచిత్రం చిత్రీకరణ బుధవారం పీలేరు మండలం ఎర్రగుంటపల్లె పంచాయతీ శ్రీఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ నిర్మాణకర్త కిషోర్‌స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకులు ఎస్‌కే సురేష్, నిర్మాత ఎస్. విజయకుమార్ మాట్లాడుతూ ట్రయాంగిల్ లవ్ స్టోరీ బ్యాక్ డ్రాప్‌లో స్నేహం, ప్రేమ, నమ్మకం కథాంశంలో చిత్ర నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. చిత్రంలో కథానాయకుడిగా అభి, కథానాయికిగా సనా, ఇతర ప్రధాన పాత్రల్లో ఎన్టీఆర్ లెజెండరీ అవార్డు గ్రహీత ఖాదర్‌బాషా, షైన్ బాబ్జాన్, తరిగొండ రాధాకృష్ణ, సురేష్, కృష్ణ, సుహేల్, మధు, చంద్ర, అను, బేబీ ఆరాధ్య, మన్సూర్ నటిస్తున్నారని చెప్పారు. ఈ చిత్రానికి డీఓపీలుగా మన్సూర్, సుహేల్ వ్యవహరిస్తున్నారు. లఘుచిత్రం పీలేరు, బండకిందపల్లె, ఎర్రగుంటపల్లెలో జరిగే రెండు షెడ్యూల్స్‌లో పూర్తి చేయనున్నట్లు దర్శక నిర్మాతలు తెలిపారు.

మేమున్నాం... మీకు తోడుగా...

(10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

స్పందనకు వందనం

• బాబుకాలనీలోని మురుగు కాలువల్లో పూడికను సిబ్బంది తొలగించారు. గత నెల 18న 'ఈనాడు'లో ప్రచురితమైన 'దారులు అధ్వానం... కాలువల్లేక దుర్గంధం' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో పంచాయతీ అధికారులు స్పందించి కాలువల్లో పూడిక తీశారు. దీంతో మురుగు నిల్వ లేకుండా సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

• గ్రామీణ మండలం వేంపల్లె పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పంచాయతీలోని కన్నెమడుగువారిపల్లెలో చెత్తపేరుకుపోవడంతో గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు 'ఈనాడు'లో ఈ నెల 6న 'మేమున్నాం...మీతోడుగా'లో భాగంగా కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేసి సమస్యను పరిష్కరించారు.

• మదనపల్లె మండలం బొమ్మనచెరువు పంచాయతీ మందబండ గ్రామంలో రోడ్డుపై ఉన్న మట్టిదిబ్బలను పంచాయతీ అధికారులు తొలగించారు. ఇక్కడి సమస్యపై స్థానికులు 'మేమున్నాం... మీతోడుగా'కు సమాచారం ఇవ్వడంతో 'ఈనాడు'లో ఈ నెల 6న కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు.

• మదనపల్లె గ్రామీణ మండలంలోని బసినికొండ పంచాయతీ మున్సిపల్ బోర్డు వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఇక్కడ సమస్యపై గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు ఈ నెల 6న 'ఈనాడు'లో మేమున్నాం... మీతోడుగా శీర్షికలో ప్రచురితమైంది. దీంతో ఎంపీడీవో మస్తాన్‌వల్లి స్పందించి చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించారు.

• మదనపల్లె మండలం వేంపల్లె కాలనీలో మురుగు కాలువలు శుభ్రం చేశారు. ఇక్కడ చెత్త పేరుకుపోయి నీరు ప్రవహించకపోవడంతో కాలనీవాసులు 'మేమున్నాం... మీతోడుగా'కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఈ నెల 6న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవడంతో సమస్య పరిష్కారమైంది.

• **కలకడ:** మండలంలోని ఎర్రకోటపల్లె పంచాయతీ వెంకటగారిపల్లె రోడ్డు అభివృద్ధికి నోచుకుంది. ఎర్రకోటపల్లె రోడ్డు నుంచి వెంకటగారిపల్లె రోడ్డు గుంతలమయమై, కంపచెట్లతో మూసుకుపోవడంతో రాకపోకలు సాగించడానికి ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారి అధ్వానంగా ఉందని ఈనాడులో ప్రచురించిన కథనానికి వారు స్పందించారు. పంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారులు పంచాయతీ నిధులతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లు తొలగించి, గుంతలకు మట్టితోలి అభివృద్ధి చేశారు. రోడ్డు అభివృద్ధి చేయడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

చేతికందిన పంట వర్షార్పణం

• మునగ, వంగ పంటలకు భారీ నష్టం
• పగిలిన టమాటాలతో రైతుల గగ్గోలు

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : వాల్మీకిపురం వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలోని పెద్దమండ్యం, వాల్మీకిపురం, గుర్రంకొండ, కలకడ, కలికిరి మండలాల్లో రబీ సీజన్‌లో 1988.11 హెక్టార్లలో వరి, దాదాపు 3 వేల ఎకరాల్లో టమాటను రైతులు సాగు చేశారు. దాదాపు వేయి ఎకరాల్లో మునగ, వంగ తదితర పంటలు వేశారు. అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో పెద్దమండ్యంలో 31.0, వాల్మీకిపురంలో 52.4, కలికిరిలో 53.4 మి.మీల వర్షపాతం నమోదు కావడంతో పాటు కురిసిన భారీ వర్షానికి దాదాపు వంద ఎకరాల్లో టమాట, వరి, మునగ, వంగ తోటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. ఈ భారీ వర్షాల కారణంగా వరి పంట నేల కొరగ్గా, టమాట, మునగ, వంగ పంటలకు ఉన్న పూత, పిందెలు నేలరాలి రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఏడీఏ వాణిశ్రీ మాట్లాడుతూ తుపాను ప్రభావం సబ్ డివిజన్ పరిధిలో పెద్దగా లేదని, భారీ గాలులు లేనందున పంటలకు నష్టం పెద్దగా జరగలేదన్నారు. జరిగిన నష్టాన్ని తమ సిబ్బంది గుర్తించే పనిలో ఉన్నారని, త్వరలోనే నష్టపోయిన రైతుల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని స్పష్టం చేశారు.


వాల్మీకిపురం మండలం బోగంపల్లెలో నేలకొరిగిన వరిపంట


పూత రాలిపోయి దెబ్బతిన్న మునగ పంట

నర్సరీలకు వానల దెబ్బ

నర్సరీ పెట్టుకుని పండ్ల మొక్కలు, పూల మొక్కలు అమ్ముకుని జీవనం సాగిస్తున్నాను. తుపాను కారణంగా నర్సరీలో నీరు చేరి మొక్కలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వమే నర్సరీ నిర్వాహకులను ఆదుకోవాలి. **- రమణయ్య, నర్సరీ నిర్వాహకుడు, వాల్మీకిపురం**

పూత, కాయలు రాలిపోయాయి



రెండెకరాల్లో మునగ, రెండెకరాల్లో వంగ సాగు చేశాను. దాదాపు రూ.3 లక్షలు వరకు పెట్టుబడి పెట్టాను. మునగ, వంగ పూత, కాయ దశలో ఉండగా చేతికి వచ్చే పంట తుపాను తాకిడితో దెబ్బతింది. భారీ వర్షానికి మునగ పూత మొత్తం నేలరాలింది. వంగ పూత, కాయలు రాలిపోయి తీవ్రంగా నష్టపోయాం. **- శేఖర్, గొల్లపల్లె, వాల్మీకిపురం మండలం**

వాన కురుస్తోంది... భవనం ఉరుస్తోంది

గత రెండు రోజులుగా అల్పపీడనం దృష్ట్యా కురుస్తున్న వర్షాల కారణంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పైకప్పు దెబ్బతిని వర్షపునీరు ఉరుస్తోంది. గ్రామీణ మండలం కొత్తపల్లె పంచాయతీ శాంతిపురానికి చెందిన అంగన్‌వాడీ కేంద్రంలో పైకప్పు పూర్తిగా దెబ్బతింది. దీంతో కారుతోంది. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు కావడంతో పిల్లలు ఎవరూ రాలేదు. పైకప్పు పూర్తిగా దెబ్బతింది. మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. అలాగే బసినికొండలోని అంగన్‌వాడీ కేంద్రంలో కూడా వర్షం కురిస్తే లోపలివైపు పైకప్పు నుంచి నీరు ఉరుస్తోంది. సబ్ కలెక్టర్ కార్యాలయం హంద్రీ-నీవా భూసేకరణ కార్యాలయం సమావేశ మందిరంలో పీఓపీ నుంచి నీరు ఉరుస్తోంది. ఎంపీడీవో కార్యాలయంలోకూడా ఇదే తరహాలో వర్షపు నీరు ఉరుస్తుంది. మరమ్మతులు చేట్టాల్సిన పరిస్థితి ఉంది. **- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ**



తుపాను సహాయక చర్యలు ముమ్మరం

• 8 పొక్లెయిన్లు... 10 మోటార్లతో పనులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : తుపాను తీవ్రరూపం దాల్చనుందన్న వాతావరణశాఖ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తం అయ్యారు. విజయవాడలో వచ్చిన వరదలను ముందస్తుగా అంచనా వేసిన అధికారులు తుపానును ఎదుర్కోవడానికి సన్నద్ధమయాయరు. మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ప్రజలు బయటకు వెళ్లేందుకు కూడా వీలులేని విధంగా వర్షం పడుతోంది. కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. మదనపల్లె పురపాలక సంఘం కమిషనర్ ప్రమీల మంగళవారం రాత్రి నుంచి పట్టణంలో పర్యటిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. బుగ్గ కాలువ, బాపన కాలువ, మేదరవీధి, జీఎంనగర్, రామ్‌నగర్ వంటి ప్రాంతాల్లో పర్యటించి స్థానిక ప్రజలను అప్రమత్తం చేశారు.

● పురపాలక సంఘం పరిధిలో కాలువలు శుభ్రం చేయడానికి, వరద నీరు నిలువకుండా బయటకు పంపేందుకుగానూ ప్రభుత్వం ఆదేశాల మేరకు 8 జేసీబీలు సిద్ధం చేశారు. వీటిని వినియోగించి పట్టణంలోని ప్రధాన కాలువల్లో పేరుకున్న చెత్తాచెదారం, బాహుదా నదిలోని వ్యర్థాలను శుభ్రం చేయిస్తున్నారు. వర్షం ఎక్కువగా పడి వరద నీరు నివాస ప్రాంతాల్లోకి వస్తే అలాంటి చోట్ల మోటార్లను వినియోగించి ఆ నీటిని బయటకు పంపడానికి 10 మోటార్లను సిద్ధంగా ఉంచారు. ప్రత్యేకించి లోతట్టు ప్రాంతాలపై అధికారులు దృష్టిపెట్టి అక్కడ నివాసముంటున్న ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. భారీ వర్షం వచ్చినట్లైతే అక్కడి నుంచి బయటకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేశారు. మదనపల్లెలో 42.8 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. రానున్న 48 గంటలు తుపాను మరింత బలపడనుందని, బుధవారం రాత్రి భారీ స్థాయిలో వర్షం వచ్చే అవకాశాలు ఉన్నట్లు వాతావరణశాఖ పేర్కొంది.


మురుగు కాలువలను శుభ్రం పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ ప్రమీల

6 బృందాలు... 6 పునరావాస కేంద్రాలు

పట్టణంలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యవేక్షించి తగిన చర్యలు చేపట్టడానికి 6 బృందాలను ఏర్పాటు చేశాం. అలాగే ముందస్తు జాగ్రత్తగా ఆరు పునరావాస కేంద్రాలను గుర్తించాం. పట్టణంలోని కాలువల్లో పూడిక తొలగింపునకు 302 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. ప్రజలను కాపాడేందుకు ఎప్పటికప్పుడు వారిని అప్రమత్తం చేస్తున్నాం. **- ప్రమీల, కమిషనర్, మదనపల్లె పురపాలక సంఘం**

In the Court of the Civil Judge (Junior Division) : Vayalapadu
OS No. 91/2023
వాది : ఎస్. జమీరుద్దీన్
ప్రతివాదులు : ఎస్. హనీఫ్ మరియు ఇతరులు
1వ మరియు 2వ ప్రతివాదులకు సమను
1వ ప్రతివాది : షేక్ హనీఫ్, తండ్రి లేట్ మురాద్‌షా వల్లి, వయస్సు 58 సం॥లు, ముస్లిం.
2వ ప్రతివాది : షేక్ అల్తాఫ్ మొహిద్దీన్, తండ్రి లేట్ మురాద్‌షా వల్లి, వయస్సు 56 సం॥లు, ముస్లిం. ఇరువురి నివాసం కోట వీధి, చింతపర్తి గ్రామం మరియు పోస్టు, వాయల్పాడు మండలం.
పై దావాను వాది మీపై మరియు ఇతరులపై రిజిష్టరు విక్రయ పత్రం కోరుతూ దాఖలు చేసియున్నాడు. పై దావా మరియు I.A.No. 172/2023 మీ హాజరుకు గాను వాయిదా 18.10.2024వ తేదీన ఉన్నది. కావున మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల పై తేదీన పై కోర్టు నందు నేరుగా గానీ లేదా వకీలు ద్వారా గానీ ఉ॥ 10.30 ని॥లకు హాజరై తెలుపుకొనవచ్చును. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడును.
కె.సదాశివరెడ్డి, M.A., B.L., వాదిపరం అడ్వకేట్, వాయల్పాడు.

పీటీఎం ఎంపీడీవోగా ఆజాద్

పెద్దతిప్పసముద్రం : పీటీఎం ఎంపీడీవోగా అబ్దుల్‌కలాం ఆజాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా, తవణంపల్లె మండలం ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయన బదిలీపై పీటీఎంకు వచ్చారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రజలకు అందేలా సిబ్బందిని అప్రమత్తం చేస్తామన్నారు. పారదర్శకంగా అధికారులు పనిచేసి ప్రజల నుంచి మన్నన పొందేలా చూస్తామన్నారు.

వరద బాధితులకు విరాళం

మదనపల్లె పట్టణం: వరద బాధితుల సహాయార్థం మదనపల్లె గ్రేటర్ పాస్టర్ అసోసియేషన్ నాయకులు రూ.10,116 విరాళంగా అందజేశారు. బుధవారం ఆ సంఘం అధ్యక్షుడు జోనాస్ జాన్ బాబు, సెక్రటరీ శాంసన్, కోశాధికారి శామ్యూల్, పాస్టర్లు జీవరత్నం, దేవమణి శామ్యూల్ తదితరులు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను కలిసి విరాళం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రైస్తవుల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. తెదేపా నాయకులు శ్రీరాములు పాల్గొన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

కలకడ : మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీపీ శ్రీదేవి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ హాజరైనారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడంతో వాయిదా పడింది. మండలంలో మొత్తం 11 మంది ఎంపీటీసీ సభ్యులున్నారు. అందులో వైకాపాకు 8 మంది, కూటమికి 3 సభ్యులున్నారు. కూటమి సభ్యులు ముగ్గురు హాజరు కాలేదు. వైకాపాకు చెందిన 8 మందికి సభ్యులకుగాను ఎంపీపీ శ్రీదేవి, కలకడ-2 ఎంపీటీసీ సభ్యురాలు నూర్‌బీ మాత్రమే హాజరయ్యారు.

ఈవోపీఆర్డీగా అబ్దుల్ షుకూర్

మదనపల్లె గ్రామీణ: మండల పరిషత్ ఈవోపీఆర్డీగా అబ్దుల్ షుకూర్ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల పంచాయతీరాజ్‌శాఖలో బదిలీల్లో భాగంగా మదనపల్లెలో పనిచేస్తున్న వెంకట సుబ్బయ్యను కలకడ మండలానికి బదిలీ చేశారు. ఈ స్థానంలో కురబలకోటలో ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న అబ్దుల్ షుకూర్‌ను మదనపల్లె మండల ఈవోపీఆర్డీగా నియమించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

కళాశాల ప్రిన్సిపల్‌కు అవార్డు

కురబలకోట: మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యువరాజ్‌కు రాష్ట్రస్థాయి ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డును ప్రకటించారు. ఐఎస్‌టీఈ మేనేజ్‌మెంట్ కమిటీ రాష్ట్రస్థాయి ఉత్తమ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ 2023 కృష్ణకుమార్ స్మారక రాష్ట్ర పురస్కారానికి డాక్టర్ యువరాజ్ పేరును ప్రకటించింది. ఈ పురస్కారాన్ని అక్టోబర్ 25వతేదీ కర్నూలు జిల్లా కేంద్రంలోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో అందజేయనున్నట్లు తెలిపారు. ఏటా ఇంజినీరింగ్ అధ్యాపకులు, విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డులు ప్రకటిస్తారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ విజయభాస్కర్‌చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

వర్షపు నీటి నిల్వల తొలగింపు


మడికయ్యల శివాలయం వద్ద నీటి నిల్వలను తొలగిస్తున్న పంచాయతీ కార్మికుడు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె పంచాయతీలోని శివానగర్, టీచర్స్ కాలనీ, మడికయ్యల శివాలయం పరిసర ప్రాంతాలో వర్షపునీరు నిల్వ ఉండకుండా సర్పంచి శరత్‌రెడ్డి, కార్యదర్శి మంజుల ఆధ్వర్యంలో బుధవారం పంచాయతీ సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారు. నీటి నిల్వలున్న ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తను తొలగించి ఆ నీరు కాలువల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. మడికయ్యల శివాలయం, అయ్యప్ప స్వామి ఆలయాలకు భక్తులు ఎక్కువగా వస్తారని, వర్షపు నీరు నిల్వల వల్ల భక్తులకు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాభివృద్ధి


తంబళ్లపల్లెలో సిమెంటు రోడ్డుకు భూమిపూజ చేస్తున్న తెదేపా నేత జయచంద్రారెడ్డి


వాల్మీకిపురం మండలం జర్రావారిపల్లెలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్న తెదేపా నాయకులు


కంభంవారిపల్లె మండలం గోరంట్లపల్లెలో సిమెంటు రోడ్డుకు భూమి పూజ

కూటమి ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తంబళ్లపల్లె తెదేపా నేత జయచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో పల్లెపండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. తంబళ్లపల్లెలో రూ.32 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు జయచంద్రారెడ్డి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. గత వైకాపా పాలనలో గ్రామాభివృద్ధి కుంటుపడిందని కూటమి ప్రభుత్వ హయాంలో చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ది అభివృద్ధి బాటలు వేస్తామని నాయకులు తెలిపారు. సంక్రాంతి తరువాత అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతాయన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, మదనపల్లె క్లస్టర్ బృందం**

ఆహారం అందిస్తాం... సమాచారమివ్వండి

మదనపల్లె విద్య: తుపాను కారణంగా మదనపల్లెలో భోజనం దొరని వారి కోసం ఆహారం సమకూరుస్తున్నామని హెల్పింగ్ మైండ్స్ సంస్థ వ్యవస్థాపకుడు అబుబకర్ సిద్దిక్ తెలిపారు. బుధవారం సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లె చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఎవరైనా వర్షాలతో ఇబ్బందులు పడుతున్నా, ఆహారం అవసరమైనా సహాయక చర్యలు, భోజనం అందిస్తామని తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఫయాజ్, కిరణ్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై యువకుడిపై దాడి

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : నడి రోడ్డుపై యువకుడిపై దాడి చేసి గాయపర్చిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు మదనపల్లె ఒకటో పట్టణ సీఐ చాంద్‌బాషా తెలిపారు. మదనపల్లె మండలం పొన్నూటిపాళ్యం పంచాయతీ భువనేశ్వరినగర్‌కు చెందిన జగదీష్ (27) మదనపల్లెకు చెందిన దేవీ వరప్రసాద్ అలియాస్ దేవ తన రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాన్ని తీసుకొచ్చి రూ.40 వేలు అత్యవసరంగా ఉందని ద్విచక్ర వాహనాన్ని తనఖా పెట్టి డబ్బు తీసుకున్నాడు. 8 నెలలైనా డబ్బు చెల్లించకపోవడంతో జగదీష్ డబ్బు చెల్లించాలని దేవీ వరప్రసాద్‌పై ఒత్తిడి తెచ్చాడు. దీంతో కక్ష పెంచుకున్న దేవీ వరప్రసాద్ మంగళవారం రాత్రి పట్టణంలోని మల్లికార్జున కూడలిలో ఉన్న జగదీష్‌తో గొడవపెట్టుకున్నాడు. ఈ గొడవలో జగదీష్‌పై దేవీ వరప్రసాద్, అతని స్నేహితులు సురేష్, వెంకి, భాస్కర్‌లు విచక్షణా రహితంగా దాడి చేసి కొట్టారు. ఈ దాడిలో జగదీష్‌పై దాడి చేస్తున్నవారిని అడ్డుకోబోయిన స్నేహితుడు రెడ్డిబాషాపై కూడా వారు దాడిచేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు. పట్టణంలో రోడ్లపై ఎవరైనా గొడవపడితే వదిలేది లేదని వారిపై కేసులు పెట్టి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

పంట దున్నేశారని డీఎస్పీకి ఫిర్యాదు

మదనపల్లె నేరవార్తలు: తాము పండించుకున్న వేరుసెనగ పంటను తమ సోదరులు దున్నేశారని మదనపల్లె మండలం బండకిందపల్లెకు చెందిన శారదమ్మ బుధవారం మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడుకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు శారదమ్మ 20 ఏళ్లుగా తండ్రి నుంచి సక్రమించిన భూమిలో వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఎకరా విస్తీర్ణంలో వేరుసెనగ పంట సాగు చేయగా ఆ భూమి తమకు చెందుతుందని సోదరుడు రాజన్న అతని కుటుంబ సభ్యులు దున్నేశారని ఫిర్యాదు చేశారు. ప్రశ్నిస్తే చంపుతామని బెదిరిస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై మదనపల్లె రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధితురాలు తెలిపారు. దీనిపై విచారణ చేసి న్యాయం చేస్తామని డీఎస్పీ తెలిపారు.

మురుగుతో దోమల మోత

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని అమ్మచెరువుమిట్టలో మురుగునీటి కాలువలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కోళ్లబైలు పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మకాలనీకి వెళ్లే మార్గంలోని ఈ కాలనీలో దాదాపు 40 కుటుంబాలున్నాయి. ఇక్కడ సిమెంట్ రోడ్లు నిర్మించి మురుగు నీటి కాలువలు నిర్మించలేదు. దీంతో ఇళ్ల నుంచి వెల్లువడే మురుగు ఇళ్ల ఎదుట ఇలా అధ్వానంగా ప్రవహిస్తుంది. దోమల నిలయంగా మారింది. ప్రజలు జ్వరాలబారినపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై ఈవోపీఆర్డీ శ్రీహరిని వివరణకోరగా ప్రతిపాదనలు పంపించి నిధులు వచ్చిన వెంటనే పనులు చేపట్టి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, అప్పటి వరకు తాత్కాలికంగా పారిశుద్ధ్య పనులు చేపడతామని చెప్పారు.

బహిరంగ ప్రకటనకు బదులు ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి మా కక్షికర్త వీరంశెట్టి సుదాకర, తండ్రి వీరంశెట్టి నాగయ్య, నివాసం డోర్ నెం.2/1862 దు., కడప రోడ్డు, పీలేరు గ్రామం, పీలేరు మండలం, అన్నమయ్య జిల్లా వారి తరపున కామిశెట్టి సుధాకర, తండ్రి కామిశెట్టి సహదేవయ్య, నివాసం కడప రోడ్డు, పీలేరు గ్రామం, పీలేరు మండలం, అన్నమయ్య జిల్లా వారు 09-10-2024వ తేదీన ఈనాడు న్యూస్ పేపర్‌లో కె.మంజునాథరెడ్డి, సి.నాగభూషణం, న్యాయవాదులు, మదనపల్లి/పీలేరు వారి ద్వారా జారీ చేసిన బహిరంగ ప్రకటనకు బదులు ప్రకటన ఏమనగా!

సదరు ప్రకటనలో కనిన షెడ్యూలు సర్వే నెంబరులో దాఖలా భూములు మా కక్షికర్త 08-12-2021వ తేదీన విక్రయపత్రం దస్తావేజు నెం.112/2022 ద్వారా విక్రయించుకొని పూర్తి హక్కులతో స్వతంత్రముగా అనుభవించుకుంటూ ఉండి ప్లాట్లుగా విభజించినాడు. మా కక్షికర్త పై తెలిపిన కామిశెట్టి సుధాకర గారికి సదరు బహిరంగ ప్రకటన షెడ్యూలులో కనపరిచిన సర్వే నెం. 636/1, 636/2 ప్లాట్ నెం.1 నుండి 5 మరియు 8 మరియు సర్వే నెం.639/1 మరియు 639/2లో ప్లాట్ నెంబర్లు 2 నుండి 4, 5ఎ, 14 నుండి 18, 23 నుండి 34, 39, 40, 47 నుండి 50 నెంబర్లు గల ప్లాట్లను విక్రయించియుండలేదు. సదరు ప్లాట్లుకు మా కక్షికర్త 08-05-2022వ తేదీన ఎలాంటి విక్రయ అగ్రిమెంటు వ్రాసి ఇచ్చియుండలేదు.

సదరు కామిశెట్టి సుధాకర తప్పుడు విషయములతో, తప్పుడు పత్రములు సృష్టించి మహారాజశ్రీ పీలేరు 11వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో O.S.No.6/2022గా దావా వేసియున్నారు. సదరు దావాలోని ఆస్తిలో కామిశెట్టి సుధాకరకు ఎటువంటి హక్కులేదు. 08-05-2022వ తేదీన ఎటువంటి విక్రయ అగ్రిమెంటు వ్రాసి ఇచ్చియుండలేదని మా కక్షికర్త తన వాదనను వ్రాతపూర్వకముగా తెలియచేసినారు మరియు సదరు దావాకు విచారణ అర్హత లేదని తిరస్కరించవలసినదిగా కోరుతూ ఐ.ఎ.నెం.145/2022 వేసియున్నారు.

సదరు ఐ.ఎ. నెంబరుకు జవాబు దాఖలా చేయకుండా కాలహరణ చేస్తూ తప్పుడు సంగతులతో బహిరంగ ప్రకటన జారీ చేసియున్నారు. సదరు కామిశెట్టి సుధాకర గారికి సదరు బహిరంగ ప్రకటనలో కనపరిచిన ప్లాటులో ఎటువంటి హక్కులు లేదు. మా కక్షికర్తకి సర్వహక్కులు కలవని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

ఇట్లు : కాకులారం సుధాకర రెడ్డి, పుట్టా వెంకటరమణారెడ్డి, న్యాయవాదులు, పీలేరు. Cell : 9440202315, 9885287755

చెరువుల భద్రతపై తక్షణం స్పందించండి : ఎమ్మెల్యే


చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, అధికారులు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనంతో వర్షాలు కురుస్తున్నాయని, చెరువుల భద్రతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశించారు. బుధవారం గ్రామీణ మండలం చీకలబైలు పంచాయతీలోని కదిరమ్మ చెరువు, వెంకటమ్మ చెరువు, మేడిపల్లె చెరువులను పరిశీలించారు. 1996లో కురిసిన వర్షాల కారణంగా మదనపల్లెలో ఈ చెరువులతో పట్టణాన్ని వరద నీరు ముంచెత్తిన విషయం తెలిసిందే. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలపై ఎమ్మెల్యే అధికారులను ముందస్తుగా అప్రమత్తం చేశారు. ప్రస్తుతం చెరువుల్లో నీరు లేనప్పటికీ భారీ వర్షం వస్తే, చెరువులు, వంకలు నిండి వంకల్లో నీరు ప్రవహించే పరిస్థితులుండటంతో ఆయన క్షేత్రస్థాయిలో చెరువులు, మట్టికట్టలను పరిశీలించారు. భారీ వర్షం కురిస్తే మట్టికట్టలకు అవసరమైన పటిష్ఠ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే గ్రామాల్లో ఎలాంటి విపత్తు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచి ప్రభాకర్, తహసీల్దారు ఖాజాబీ, జలవనరుల శాఖ ఏఈ బాబు రాజేంద్రప్రసాద్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రంగప్ప పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

మదనపల్లె గ్రామీణ: గ్రామంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హామీ ఇచ్చారు. బుధవారం మండలంలోని చీకలబైలు పంచాయతీ సర్పంచి ప్రభాకర్‌తో కలిసి గ్రామాల్లో పర్యటించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుణశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించి మృతుడి భార్య మంగమ్మకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. గోకులం పథకం కింద షెడ్డు మంజూరు చేయిస్తామని, ఇదే గ్రామానికి శ్రీనివాసులను పరామర్శించి ప్రభుత్వం తరపున పక్కా గృహం మంజూరు చేస్తామని హామీఇచ్చారు. గ్రామ సచివాలయం తనిఖీ చేసి ఇద్దరు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పంచాయతీ సమస్యలపై సర్పంచిని అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: తుపాను సందర్భంగా తలెత్తే సమస్యల పట్ల అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజంపేట సబ్ కలెక్టర్ మైఖోమ్ నైదియాదేవి పేర్కొన్నారు. పట్టణంలోని నరసరాంపేట, రెడ్డివారిపల్లె వంతెన, ధర్మాపురం ప్రాంతాలను ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌తో కలిసి బుధవారం ఆమె పరిశీలించారు. గుంజనేటికి చేరుతున్న వరద నీరు, దాని వల్ల తలెత్తే పరిణామాలపై అధికారులతో మాట్లాడారు. పరిసర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు వారికి పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని సూచించారు. తహసీల్దారు మెహబూబ్ చాంద్, సిబ్బంది పాల్గొన్నారు.


గుంజనేటి పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, అధికారులు

రాయచోటి
• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

ఇసుక క్వారీల పరిశీలన

కోమంతరాజుపురం(పెనగలూరు), న్యూస్‌టుడే: మండల పరిధిలోని నూతనంగా మంజూరు అయిన నారాయణనెల్లూరు, కోమంతరాజుపురం ఇసుక క్వారీలను తహసీల్దారు సీహెచ్ ఇంద్రాణి, ఎంపీడీవో విజయారావు, జిల్లా మైనింగ్ అధికారులు పరిశీలించారు. బుధవారం ఉదయం రెండు క్వారీ ప్రాంతాలు, స్టాక్ పాయింట్‌లను చూశారు. ఇసుక తవ్వాల్సిన ప్రాంతంలో సర్వే చేసి హద్దులు నిర్ణయించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజశేఖర్, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.


ఇసుక క్వారీ పరిశీలిస్తున్న అధికారులు

వాయుగుండం... ప్రజల్లో భయం

కుండపోతగా కురుస్తున్న వర్షాలు ◆ జలమయమైన రహదారులు ◆ పంట నష్టంతో రైతుల ఆక్రందన


రాజంపేట : రైల్వేకోడూరు మార్గంలో వర్షపు నీటితో చెరువులా కనిపిస్తున్న రహదారి


లక్కిరెడ్డిపల్లె : తుపాను దాటికి నేలకొరిగిన విద్యుత్తు స్తంభం

రాయచోటి, రైల్వేకోడూరు, రాజంపేట పరిసర ప్రాంతాల్లో రెండు రోజులుగా భారీ వర్షం కురుస్తోంది. బుధవారం పలుచోట్ల 10 సెం.మీ.పైన వర్షపాతం నమోదైంది. రోడ్లు జలమయమయ్యాయి. పలు ప్రాంతాలు నీట మునిగాయి. ఉద్యాన పంటలు నేలకొరిగాయి. గురువారం భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు అలెర్ట్ చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేస్తున్నారు. పుల్లంపేటలోని మారెమ్మ ఆలయాన్ని వరద నీరు చుట్టుముట్టింది. రైల్వేస్టేషన్ రోడ్డుపైన ప్రవాహం అధికం కావడంతో రాకపోకలకు ఆటంకం కలిగింది. శేషాచలం అడవుల నుంచి వరద నీరు క్రమంగా గుంజనేటికి చేరుతోంది. రైల్వేకోడూరు పట్టణంలోని అంకమ్మనగర్, ధర్మాపురం, లక్ష్మీనగర్‌వంటి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. శెట్టిగుంట, మాధవరంపోడు, ఉప్పరపల్లె, కే. బుడుగుంటలపల్లె గ్రామాల్లో వరద నీరు పంట పొలాల్లోకి చేరుతోంది. రైల్వేకోడూరు పంచాయతీ కార్యదర్శి ప్రసాదరావు అంకమ్మనగర్ ప్రాంతంలో వర్షపునీరు వెళ్లేందుకు కాలువలు తీయించారు. రైల్వేకోడూరు సీపీఐ కార్యాలయం సమీపంలో ఆత్మకూరు అరుణమ్మ అనే మహిళకు చెందిన పూరి గుడిసె గోడలు కూలిపోయాయి. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. నందలూరు మండలం ఆడపూరు, పాటూరు, కుమ్మరపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాలల్లో దాదాపు 150 ఎకరాల మేర వరి పంట నీట మునిగినట్లు మండల సహాయ వ్యవసాయాధికారి శ్రీనివాసులు తెలిపారు. **- న్యూస్‌టుడే, రాయచోటి క్లస్టర్ బృందం**


రాయచోటిలోని అగ్నిమాపక కేంద్రం వీధి జలమయం


చిన్నమండెం సమీపంలో టమాట తోటలో నిలిచిన వర్షపు నీరు


రాయచోటి : దాదేసాహెబ్‌వీధిలో ఇళ్లలోకి చేరుతున్న వరదనీరు


పుల్లంపేట : సాధువారిపల్లెలో ఎర్రవంకను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నైదియాదేవి


రాజంపేట మండలం తాళ్లపాక వద్ద రోడ్డుపై భారీ ఎత్తున చేరిన వర్షపునీరు

సీసీ రోడ్లకు భూమి పూజ


భూమి పూజలో పాల్గొన్న తెదేపా నేతలు

పుల్లంపేట: మండల పరిధిలోని అప్పయ్యరాజుపేట పంచాయతీ పరిధిలోని ఒంటిళ్లు, రామక్కపల్లె గ్రామాల్లో 26 లక్షల వ్యయంతో 520 మీటర్ల సీసీ రోడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, తెదేపా నియోజకవర్గ బాధ్యుడు రూపానందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. చిట్వేలి మండలం తిమ్మయ్యగారిపల్లె పంచాయతీలో 30 లక్షలతో 600 మీటర్ల సీసీ రోడ్లకు భూమి చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు సుధాకర్, కేకే చౌదరి, వెంకటసుబ్బయ్యయాదవ్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రామాపురం: నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలవలు నిర్మిస్తామని తెదేపా నేత మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని హసనపురం, రాచపల్లె, నల్లగుట్టపల్లె, సరస్వతిపల్లె పంచాయతీలోని సీసీ రోడ్డుకు నిర్మాణాలకు భూమి పూజ చేశారు. మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రమేష్‌రెడ్డి, సర్పంచి మునీర్ బాషా, రవికుమార్‌రెడ్డి, రెడ్డమ్మ, బాబు పాల్గొన్నారు.

పేదలకు భూములు పంపిణీ చేయాలి


తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: అర్హులైన పేదలకు సాగు భూములివ్వాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ళ శ్రీనివాసులు అన్నారు. బుధవారం సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ప్రభుత్వ భూములు వాగులు, వంకలు గుట్టలపై భూకబ్జాదారులు గతప్రభుత్వ బినామి పేర్లతో అసైన్‌మెంట్ కమిటి లో పట్టాలు పొందారన్నారు. వాటిని రద్దుచేసి నిజమైన లబ్దిదారులకు ఇవ్వాలన్నారు. సాగుభూమి పంపిణి చేయలేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పోరాటలకు సిద్దమవుతామన్నారు. కార్యక్రమంలో ఓబులేష్, రెడ్డి చరణ్, నరేష్, భాగ్యమ్మ,లక్ష్మీదేవిలు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందుల అందజేత

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: సన్న జీవాలు మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు తప్పకుండా వేయించాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై పేర్కొన్నారు. మద్దిరేవుల పంచాయతీ వంకగడ్డరాచపల్లెలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం జరిగిన ఆయన మాట్లాడారు. ఈ నెల 30 వరకు పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసి నట్టల నివారణ మందులు జీవాలకు అందిస్తామన్నారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. రాయచోటి ఉప సంచాలకులు డాక్టరు మాలకొండయ్య, లక్కిరెడ్డిపల్లె ఏడీ సుధీర్నాద్‌బెనర్జీ, పశు వైద్యాధికారి మహేష్, పశుసంవర్ధక సహాయకులు శాంతిరాజ్, రాధిక, ఓబులయ్య, పాడిరైతులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

రామాపురం, న్యూస్‌టుడే: ఆలయాల నిర్మాణంతో సనాతన ధర్మం పెంపొందుతుందని వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని నీలకంఠరావుపేటలో బుధవారం నిర్వహించిన ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికచింతన అలవర్చుకుని భక్తి భావంతో మెలగాలన్నారు.

అవకతవకలుంటే ఫిర్యాదు చేయండి

సిద్దవటం, న్యూస్‌టుడే : ఈ-పంట నమోదులో అక్రమాలు చోటుచేసుకుంటే సమీపంలోని రైతు సేవా కేంద్రంలో ఫిర్యాదు చేయాలని బద్వేలు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు నాగరాజు తెలిపారు. సిద్దవటం మండలం టక్కోలులో బుధవారం ఈ-పంట నమోదుపై సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. రైతుల సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. తెదేపా నాయకుడు నాగమునిరెడ్డి, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు సింగరయ్య, చిన్నక్క, ఐసీఆర్పీలు సుమలత, పద్మావతి, వరలక్ష్మి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

సమస్యలపై రాజీలేని పోరాటం


మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకుడు శంకర్

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో రాజీ లేని పోరాటాలు చేస్తామని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శంకర్, రాష్ట్ర కార్యదర్శి బంగారావ్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జిల్లాలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా డిసెంబర్ 4న విజయవాడలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మావులూరి విశ్వనాథ్, ఉదయ్ కిరణ్, సత్తార్, చెన్నయ్య, రమణ పాల్గొన్నారు.

నిందితుడిని రిమాండుకు తరలింపు

పెనగలూరు, న్యూస్‌టుడే: చెల్లని చెక్కు కేసులో నందలూరు న్యాయస్థానం విధించిన శిక్షను తప్పించుకుని పరారీలో ఉన్న ప్రకాశం జిల్లా లక్ష్మీనరసాపురం గ్రామానికి చెందిన పోలు మహేష్‌ను అదుపులోకి తీసుకుని న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా ఏడాది పాటు శిక్ష విధిస్తూ తీర్పు నివ్వడంతో కడప జైలుకు పంపినట్లు రాజంపేట మన్నూరు సీఐ బీవీ రమణ, ఎస్సై శివ ప్రకాష్ రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నమయ్య జిల్లా పెనగలూరు మండల కేంద్రంలోని సాతుపల్లికి చెందిన గంధంశెట్టి నరసయ్య తన కుమారుడు తరపున పోలు మహేష్‌తో పాటు మరో ఇద్దరికి రూ.30 లక్షలు డబ్బులిచ్చినట్లు చెప్పారు. వారు కొన్నాళ్లకు డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగినప్పుడు చెక్కులు ఇవ్వడంతో వాటిని బ్యాంకుకు తీసుకెళ్లగా అవి చెల్లనివని తేలింది. దీంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించగా అప్పట్లో కేసు నమోదయినట్లు సీఐ పేర్కొన్నారు. వీరికి 2022 మార్చిలో ఏడాది పాటు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. దీంతో నిందుతులు హైకోర్టు అప్పీల్‌కు వెళ్తామని వెళ్లకుండా పరారీలో ఉండడంలో ఈ ఏడాది సెప్టెంబర్‌లో నందలూరు న్యాయమూర్తి వారెంట్ ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో నిందితుడిని మంగళవారం అదుపులోకి తీసుకుని నందలూరు న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా గతంలో ఇచ్చిన ఏడాది జైలు శిక్షనే అమలు చేయాలని ఆదేశించడంతో కడప జైలుకు పంపినట్లు తెలిపారు.

పింఛలో పెరిగిన నీటి మట్టం

సుండుపల్లి, న్యూస్‌టుడే: వై.ఆదినారాయణరెడ్డి పింఛ జలాశయంలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు ఒక అడుగు నీటిమట్టం పెరిగింది. మంగళవారం ఉదయం 973 అడుగుల వద్ద ఉన్న నీటి మట్టం బుధవారం మధ్యాహ్నానికి 974.2 అడుగులకు చేరిందని అధికారులు తెలిపారు.

తూము వంతెన పునరుద్ధరణ పనులు

చిన్నమండెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చాకిబండ రోడ్డు నుంచి మల్లూరు కస్పాకు వెళ్లే దారిలో ఉన్న తూములు మూసుకుపోయిన పాత వంతెన పనులు సర్పంచి డి.నజీర్‌బాషా చేయించారు. ఎంపీడీవో దివ్య గ్రామానికి వెళ్లి ఈ పనులను బుధవారం పర్యవేక్షించారు. 2021లో కురిసిన భారీ వర్షాలకు పైనుంచి వరదనీటికి వంతెన కొట్టుకుపోయి గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. అప్పట్లో తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ఇటీవల మంత్రి రాంప్రసాద్‌రెడ్డి కొత్త వంతెనకు రూ.49 లక్షల నిధులు మంజూరు చేయించారు. వంతెన తూములు బండరాళ్లు, కంపచెట్లతో మూసుకుపోయాయి. వర్షాలు కురుస్తున్నందున వరదనీరు వస్తే మరోసారి వంతెను తెగిపోయే ప్రమాదముందని ముందస్తు చర్యలు తీసుకొన్నారు. పీఆర్ ఏఈ హర్షవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి గౌస్‌పీర్, రాజ్‌కుమార్, రామమోహన్, శివకుమార్ పాల్గొన్నారు.


మల్లూరు కస్పా దగ్గర మూసుకుపోయిన పాత వంతెన వద్ద పనులు చేయిస్తున్న అధికారులు, సర్పంచి



పని చేయని ట్రాఫిక్ సిగ్నల్స్

రాయచోటిలో ట్రాఫిక్ సిగ్నల్స్ పని చేయడం లేదు. తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో వాహనదారులకు ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు. ప్రమాదాలు సంభవిస్తున్నాయి. బంగ్లా వద్ద ఉన్న కూడలిలో రెండు వారాలుగా ట్రాఫిక్ సిగ్నల్స్ పని చేయడం లేదు. ఇక్కడ పూర్తి స్థాయిలో ట్రాఫిక్ పోలీసులు ఉండటం లేదన్న విమర్శలున్నాయి. దీంతో వాహనదారులు ఇష్టానుసారం తమ వాహనాలను నడుపుతున్నారు. పెద్ద ప్రమాదం సంభవించక మునుపే అధికారులు స్పందించి సిగ్నల్స్‌ను మరమ్మతులు చేయించాలని వాహనదారులు డిమాండు చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ**

పారదర్శక పాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

రాయచోటి, న్యూస్‌టుడే: పారదర్శక పాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెదేపా రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే ఓర్వలేకనే వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారన్నారు. నాయకులు మదన్‌మోహన్, జయరామిరెడ్డి, మురళీ, నందకిశోర్, శివారెడ్డి, రఫీ పాల్గొన్నారు.

'వైకాపా నేతల ఆరోపణలు అర్థరహితం'

రాజంపేట, రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: నవరత్నాల పేరుతో నాడు అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఆ రత్నాలను నట్టేట ముంచేసి ఇప్పుడు సూపర్ సిక్స్ పథకాల గురించి ఆ పార్టీ నేతలు మాట్లాడడం విడ్డూరంగా ఉందని తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు జి.సుబ్బనరసయ్యనాయుడు విమర్శించారు. స్థానిక తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంపూర్ణ మద్య నిషేధం చేసిన తరువాతే ఎన్నికల్లో ఓట్లు అడుగుతామని చెప్పి.. ఆ మాట నిలబెట్టుకోక పోగా విపరీతంగా ధరలు పెంచి ప్రజల సొమ్మును దోచుకున్నారని విమర్శించారు. ఇస్లామిక్ బ్యాంకును స్థాపిస్తామని చెప్పిన వైకాపా నేతలు దాన్ని ఎక్కడ స్థాపించారో చెప్పాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్.కె.కరీం, హరి, సుబ్రహ్మణ్యం, సుబ్బరాయుడు, మహేష్, బాలాజీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తెదేపా మండలాధ్యక్షుడు సుబ్బనరసయ్యనాయుడు

రామయ్యను దర్శించుకున్న చమర్తి

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని తెదేపా రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు బుధవారం సందర్శించారు. అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాయకులు వెంకటనరసయ్య, శ్రీనివాసులునాయుడు, హరినాథ్‌రెడ్డి, శివారెడ్డి, చౌడయ్య, శరత్‌రెడ్డి పాల్గొన్నారు.

పాడి రైతులకు అవగాహన సదస్సు


పాడి రైతులతో మాట్లాడుతున్న పశువైద్యాధికారులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: తుపాను కారణంగా మండల వ్యాప్తంగా జోరుగా వర్షాలు పడుతున్న నేపథ్యంలో పాడి రైతులు తీసుకోవాల్సిన సంరక్షణ చర్యలను పశువైద్యాధికారులు రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. రాజంపేట మండలం చెర్లోపల్లి, కారంపల్లి, మందపల్లి, పులపుత్తూరు, ఊటుకూరు గ్రామాల పరిధిలోని పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజంపేట పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు ప్రతాప్ మాట్లాడుతూ.. వర్షాల కారణంగా మేత తడిచిపోయి ఉంటుందని దీని కారణంగా పశువులను రోగాలు వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో భరత్‌కుమార్‌రెడ్డి, భాగ్యవతి, సిబ్బంది వరదయ్య, నరేష్, వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

నిలిచిన విద్యుత్తు సరఫరా... గ్రామాల్లో అంధకారం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: మండలంలో సాలాబాదు పంచాయతీలో రామకృష్ణాపురం సమీపంలో తూము బోటు కొండ ప్రాంతంలో విద్యుత్తు తీగలు బుధవారం వేకువజామున 3.30 గంటల సమయంలో తెగిపోవడంతో కరెంటు సరఫరా నిలిచిపోయింది. దీంతో మలకాటిపల్లె, పెన్నానగర్, విద్యానగర్, రామకృష్ణానగర్, చెర్లోపల్లి, నడింపల్లి, పోలుబుచ్చయ్యగారిపల్లె, మంగంపేట గ్రామాల్లో అంధకారం నెలకొంది. ఒకవైపు జోరుగా కురుస్తున్న వర్షం, మరోవైపు చీకటితో దోమల దండు గ్రామీణులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. విద్యుత్తు లేకపోవడంతో తాగునీటి మోటార్లు కూడా పనిచేయలేదు. ఉదయం 11.30 గంటల తర్వాత సరఫరాను పునరుద్ధరించారు. అనంతరం కూడా పలుమార్లు అంతరాయం కలగడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. తీగలు తెగిపోయినట్లు సమాచారం రాగానే సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయించామని ఏఈ ఉదయ్‌కుమార్ తెలిపారు.

డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం

రాజంపేట, న్యూస్‌టుడే: ఆర్టీసీ ద్వారా ఉత్తమ డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నట్లు రాజంపేట డిపో మేనేజర్ రమణయ్య తెలిపారు. స్థానిక డిపోలో డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 15 బ్యాచ్‌ల ద్వారా టైలు డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన 240 మంది హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌ను పొందారన్నారు. డ్రైవింగ్ శిక్షణ పొందదలచినవారు స్థానిక డిపోలో సంప్రదించాలని కోరారు.


మాట్లాడుతున్న డీఎం రమణయ్య, పక్కన ఆర్టీసీ సిబ్బంది

గుత్తేదార్ల వ్యవహారంతో రైతులకు శాపం

చిట్వేలి (పుల్లంపేట), న్యూస్‌టుడే: చేపల పెంపకందార్ల స్వలాభం ఆయుకట్ట రైతులకు శాపంగా మారిందని వాపోతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువు నిండితో నీరు వృథాగా పోతుందని రైతులే స్వయంగా అధికారి సహకారంతో చెరువు గేటుకు బుధవారం మరమ్మతులు చేపట్టారు. గతంలో చేపల పెంపకందార్లు గేటు బీగాలు తొలగించి చెరువు నీరు పోయేందుకు కొంతమేర తెరిశారు. వారి పనులు పూర్తయిన తర్వాత పట్టించుకోక వదలిపోయారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు గుండాలకోన, శ్యామ్‌కోన, అల్లి కాలువల ద్వారా చెరువులోకి వర్షపు నీరు వచ్చే అవకాశం ఉంది.

ఇన్‌ఛార్జి మంత్రితో భేటీ

రాజంపేట, న్యూస్‌టుడే: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆర్.వేణుగోపాల్ బుధవారం విజయవాడ సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా రాజంపేట నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులను, పార్టీ కార్యాకర్తల స్థితిగుతులను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు వేణుగోపాల్ తెలిపారు.


జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వేణుగోపాల్

కానిస్టేబుల్ మృతికి సంతాపం

రాయచోటి, న్యూస్‌టుడే: లక్కిరెడ్డిపల్లె పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తూ రోడ్డు ప్రమాదానికి గురై మంగళవారం మృతి చెందిన కె.సతీష్‌రాజు మృతికి పోలీసు అధికారులు సంతాపం తెలిపారు. శిబ్యాల వైకుంఠరాచపల్లిలో పోలీసు లాంఛనాలతో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. రాయచోటి గ్రామీణ సీఐ వరప్రసాద్, సిబ్బంది మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పోలీసులు వందన సమర్పణ చేశారు.

గుంతల పూడ్చివేత

స్పందనకు వందనం

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: రాయచోటి పురపాలక పరిధిలో రోడ్లను ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. తవ్విన గుంతలను పూడ్చకుండా నెలల తరబడి అలాగే వదిలేస్తున్నారు. ఈ సమస్యపై ఈ నెల 15న 'తవ్వేశారు...వదిలేశారు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు బుధవారం గుంతలు పూడ్చడానికి చర్యలు చేపట్టారు. గాలివీడు రోడ్డులో కేబుల్ కోసం తవ్విన గుంతను పూడ్చేశారు. ఇతర ప్రాంతాల్లోని గుంతలను త్వరితగతిన పూడ్చేస్తామని వివరించారు.



పూడిక తొలగింపు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట పట్టణంలోని ప్రధాన కాలువలల్లో పూడిక తొలగక అధ్వానంగా తయారైంది. మురుగు తొలగింపు పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో బుధవారం 'అస్తవ్యస్తంగా పూడిక పనులు.. అవస్థల్లో ప్రజలు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో రాజంపేట పురపాలక అధికారులు స్పందించారు. డ్రైనేజీ కాలువల్లో జేసీబీ సాయంతో పూడిక తొలగింపు పనులు పూర్తి చేశారు.

మహిళను మోసగించిన కేసులో వ్యక్తి అరెస్టు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన ఓ మహిళ (21)ను ప్రేమించి, పెళ్లి చేసుకుంటానంటూ మోసగించిన కేసులో గాలివీడు మండలానికి చెందిన జెల్లా హేమసుందర్‌రెడ్డిని బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ హేమసుందర్‌రావు పేర్కొన్నారు. అతడు కొంతకాలంగా ప్రేమిస్తున్నట్లు నటించి చివరకు పెళ్లి వరకు వచ్చే సరికి మోసం చేశాడని ఈ నెల 4వ తేదీన ఆమె ఫిర్యాదు మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపరుచగా 14 రోజులు రిమాండ్ విధించారని వివరించారు.